ప్రజాశక్తి

మంగళవారం 9 జనవరి 2024 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా



రాఘవయ్యపార్కు వద్ద కార్మికులను అడ్డుకుంటున్న పోలీసులు

ఉక్కుపాదం

- ముని్సపల్ కార్మికులపై కలెక్టరేట్ ముట్టడి భగ్నం
- విరుచుకుపడ్డ పోలీసులు
- రోడ్డుపై బైఠాయింపు నేతలు, కార్మికులు బైఠాయింపు
- 270 మందికిపైగా అరెస్టు • వివిధ స్టేషన్లకు తరలింపు
- కార్మికులకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పరామర్శ

మున్సిపల్ కార్మికుల సమ్మెపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరేట్ ముట్టడికి వెళుతున్న కార్మికులను, నేతలను అడ్డుకున్నారు. విచక్షణారహితంగా వారిపై విరుచుకుపడ్డారు. కార్మికులను కలెక్టరేట్‌కు వెళ్లనీయకుండా వారిని భయభ్రాంతులకు గురిచేసేలా భారీస్థాయిలో పోలీసు సిబ్బందిని మొహరించి అక్రమ అరెస్టులకు పూనుకున్నారు. దీంతో నగరంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. రాఘవయ్యపార్కు సమీపంలో ఎంజి రోడ్డుపై మున్సిపల్ కార్మికులను రోప్ పార్టీతో పోలీసులు చుట్టుముట్టారు. సీనియర్ నాయకులు పి.మధు తదితరులు పరామర్శించి సంఘీభావం తెలిపారు. (పూర్తి వివరాలు లోపలి పేజీల్లో)



బాబూరావును అరెస్టు చేస్తున్న పోలీసులు



ఎన్.సిహెచ్.శ్రీనివాస్‌ను అరెస్టు చేస్తున్న దృశ్యం



వన్‌టౌన్ పోలీసుస్టేషన్ వద్ద కార్మికుల బైఠాయింపు

కార్పొరేటర్ పదవికి ఎంపి కేశినేని కుమార్తె శ్వేత రాజీనామా

ప్రజాశక్తి - విజయవాడ : నగర పాలక సంస్థ 11వ డివిజన్ తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్, విజయవాడ ఎంపి కేశినేని శ్రీనివాస్ (నాని) కుమార్తె కేశినేని శ్వేత సోమవారం తన కార్పొరేటర్ పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మికి ఆమె ఛాంబర్లో కలిసి అందజేశారు. తన లేఖను కౌన్సిల్లో పెట్టి ఆమోదించాలని కోరారు. ఈ సందర్భంగా కేశినేని శ్వేత మీడియాతో మాట్లాడుతూ రాజీనామా (మిగతా 6లో)



మేయర్ భాగ్యలక్ష్మికి రాజీనామాపత్రం అందిస్తున్న కార్పొరేటర్ కేశినేని శ్వేత

విమానాశ్రయంలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ బృందానికి స్వాగతం

ప్రజాశక్తి - గన్నవరం : పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సోమవారం రాత్రి విజయవాడ విమానాశ్రయానికి వచ్చిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్‌కు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా స్వాగతం పలికారు. ఢిల్లీ నుండి వచ్చిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్, ఎలక్షన్ కమిషనర్లు, అనూప్ చంద్ర పాండే, అరుణ్ గోయల్‌కు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనాతోపాటు (మిగతా 6లో)



విజయవాడ విమానాశ్రయంలో చీఫ్ ఎలక్షన్ కమిషన్ బృందానికి స్వాగతం పలుకుతున్న కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజబాబు తదితరులు

(వార్తలు లోపలి పేజీల్లో)





కృష్ణాజిల్లా బంటుమిల్లిలో ఉరితాళ్లతో వినూత్న నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు (పైన); ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ ధర్నా చౌక్‌లో చేపట్టిన నిరసన దీక్షలో అంగన్వాడీలు (కింద)

అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగం దుర్మార్గం

తుది లెక్కల్లో తగ్గిన పంట నష్టం

- 106 హెక్టార్లలో 33 శాతం కంటే ఎక్కువ దెబ్బతిన్న పంటలు
- అధికంగా దెబ్బతిన్న వాటిల్లో కూరగాయలు, మిర్చి
- నష్టపోయిన రైతులు 169 మంది రైతులు

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు, వీచిన ఈదురు గాలుల వల్ల నష్ట పోయిన పంటలను తొలుత అంచనా వేసిన వాటి కంటే తుది లెక్కల్లో పంట నష్టం బాగా తగ్గిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో ఉద్యాన పంటల పంట నష్టం లెక్కింపు (ఎన్యుమరేషన్), ఇన్‌పుట్ సబ్సిడీ అంచనా వ్యయం ప్రక్రియ పూర్తి అయింది. ఆ మేరకు లెక్కలను ప్రభుత్వానికి పంపినట్లు అధికారులు చెబుతున్నారు. అన్ని ఉద్యాన పంటలు కలిపి దాదాపు 2వేలకు పైగా హెక్టార్లలో పంట నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు. అయితే తుపాను ప్రభావానికి 33 శాతం కంటే ఎక్కువుగా 106.848 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు తుది లెక్కలు తేల్చారు. వీటిలో అత్యధికంగా కూరగాయల పంటలు, మిరప, అరటి పంటలు దెబ్బతిన్ననట్లు నిర్ధారించారు. పూల తోటలు, బొప్పాయి, యాపిల్ బేర్ తదితర పంటలు తక్కువుగా దెబ్బతిన్నాయి. జిల్లావ్యాప్తంగా 54.270 హెక్టార్లలో కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. 31.100 హెక్టార్లలో మిరప, 18.400 హెక్టార్లలో అరటి, 0.710 హెక్టార్లలో యాపిల్ బేర్, 1.340 హెక్టార్లలో బొప్పాయి, 1.028 హెక్టార్లలో పూల తోటలు నష్టానానికి గురైనట్లు నిర్ధారించారు. మరో 3.771 హెక్టార్లలో 33 శాతం కంటే తక్కువగా పంటలు తుపాను ప్రభావానికి గురైనట్లు తేల్చారు. వీటిలో కూరగాయల పంటలు 1.132 హెక్టార్లలోను, మిర్చి 0.700 హెక్టార్లలో, అరటి 0.975 హెక్టార్లలో, బొప్పాయి 0.720 హెక్టార్లలో, పూల తోటలు 0.244 హెక్టార్లలో నష్టానికి గురయ్యాయి. మరో వైపు ఉద్యాన పంటల సాగు చేపట్టిన 169 మంది రైతులు నష్టపోయినట్లు గుర్తించారు. వీరిలో 82 మంది కూరగాయల పంటలు, 42 మంది మిరప రైతులు, 39 మంది అరటి రైతులు, ఒకరు యాపిల్ బేర్ రైతు, ఇద్దరు బొప్పాయి రైతులు, 3 పూల తోటల రైతులు ఉన్నారు. ఇదిలా ఉంటే నష్టపోయిన రైతుల్లో అధికంగా చిన్న, సన్నకారు రైతులే ఉన్నారు. దాదాపు 166 మంది చిన్న, సన్నకారు రైతులు ఉండగా మరో ముగ్గురు ఇతర రైతులు ఉన్నారు. మరో వైపు నష్ట పోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఎంత చెల్లించాల్సి వస్తుందనే దానిపైనా ఒక అంచనాకు వచ్చారు. సుమారు రూ.19.67 లక్షలు అవుతుందని అంచనా వేశారు. వీరిలో చిన్న, సన్నకారు రైతులకు రూ.18.64 లక్షలు, ఇతర రైతులకు రూ.1.04 లక్షలు అవసరం అవుతాయని లెక్కలు తేల్చారు. పంటల వారీగా కూరగాయల పంటలకు రూ.9.22 లక్షలు, మిర్చికి రూ.5.28 లక్షలు, అరటికి రూ.4.60 లక్షలు, యాపిల్ బేర్‌కు రూ.0.159 లక్షలు, బొప్పాయికి రూ.0.227 లక్షలు, పూల తోటలకు రూ.0.174 లక్షలు అవుతాయని తేల్చారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె ఉధృతం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఆందోళన ఉధృతం చేశారు. సోమవారం నందిగామ ఆర్డీఒ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కె.గోపాల్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా 14వ రోజు సమ్మె కొనసాగుతున్న ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుందన్నారు. నందిగామ రెవెన్యూ డివిజన్ అధికారి ఎఒకు అర్జీ అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నందిగామ కమిటీ సభ్యులు కర్రీ వెంకటేశ్వరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జి.గోపినాయక్, బిల్డింగ్ వర్కర్ నాయకుల షేక్ హస్సన్, మున్సిపల్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం :** రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమ్మె 14వ రోజుకు చేరిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్‌ల వద్ద, విజయవాడ కలెక్టరేట్ వద్ద మున్సిపల్ కార్మికుల అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని సిఐటియు మండల కార్యదర్శి యం మహేష్ తెలిపారు. కొండపల్లి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సిఐటియు కార్యదర్శి టి సూరి బాబు, నాయకులు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట:** మున్సిపల్ ఉద్యోగులు, కాంటాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగాల పర్మినెంట్ కొరకు ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు), (ఏఐటియుసి) ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరవధిక సమ్మె సోమవారం కొనసాగింది. ఈ సందర్భంగా విజయవాడలో సమ్మె చేస్తున్న మున్సిపల్ వర్కర్లకు మద్దతు పలికిన సిఐటియు, సిపిఎం నాయకులతో పాటు మున్సిపల్ వర్కర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. దానికి నిరసనగా జగ్గయ్యపేట పట్టణంలోని ఎన్టీఆర్ కూడలి వద్ద కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఎస్ నాగమణి, కోటా కష్ణ, రావెళ్ళ శేషు రాంప్రసాద్, మున్సిపల్ వర్కర్స్, తదితర కార్మికులు పాల్గొన్నారు. **భవానీపురం :** నేడు పెరిగిన నిత్యావసర ధరలు, వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల నేపథ్యంలో మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని సిఐటియు పశ్చిమ సిటీ కార్యదర్శి, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా గత 14 రోజులుగా మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె నేపథ్యంలో సోమవారం సిఐటియు పశ్చిమ సిటీ ఆధ్వర్యంలో సితార సెంటర్ నుండి పలు వీధుల గుండా పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.


భవానీపురంలో


ఇబ్రహీంపట్నం


జగ్గయ్యపేటల

సమ్మె విరమించాలి : ప్రభుత్వ విప్ సామినేని

జగ్గయ్యపేట: పారిశుధ్య కార్మికులు సమ్మె చేస్తున్న నేపథ్యంలో పట్టణంలోని విలియంపేట, బంగారు కోట్ల సెంటర్, పాత కూరగాయల మార్కెట్, కన్యాకుమారి పాన్‌షాప్ కూడలిలో విపరీతంగా పేరుకుపోయిన వ్యర్థాలను స్థానిక వైసిపి నాయకులతో కలిసి ప్రభుత్వవిప్, సామినేని ఉదయభాను, ఆయన కుమారుడు, యువజన నాయకులు సామినేని వెంకట కృష్ణ ప్రసాద్ బాబు తొలగించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల జీతాల విషయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే 18 వేల నుండి 21 వేల రూపాయలు చేశారని, మీ న్యాయమైన కోరికలను ప్రభుత్వం పరిశీలిస్తుందన్నారు. మున్సిపల్ కార్మికులు ప్రజారోగ్యాన్ని దష్టిలో ఉంచుకొని మానవతా దక్పథంతో సమ్మెను విరమించాలని కోరారు. కరోనా కష్టకాలంలో మీరు చేసిన సేవలు మరువలేనివి అన్నారు. కార్మికుల న్యాయమైన కోరికలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నందున్న ట్రేడ్ యూనియన్ల వారు కూడా సమ్మె విరమింపచేసేలా చేయాలని కోరారు.

సమ్మె విరమించాలని కోరిన మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర

పట్టణంలోని పాత మున్సిపల్ ఆఫీస్ కార్యాలయంలో 14 రోజుల నుంచి కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మెను సోమవారం మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా కార్మికులతో రాఘవేంద్ర మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం కార్మికులకు అండగా నిలిచే ప్రభుత్వమని అందరూ విధుల్లో చేరాలని ఆయన కోరారు.


చెత్త శుభ్రం చేస్తున్న సామినేని, తదితరులు


సొసైటీ భవనం అదనపు కౌంటర్లు ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ జగన్మోహన్‌రావు

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామలో సొసైటీ భవనం మరమ్మతు పనులు, అదనపు కౌంటర్ల ఏర్పాటు చేసినట్లు నందిగామ ఎంఎల్ఎ మొండితోక జగన్ మోహన్ రావు పేర్కొన్నారు. కెడిసిసిబి నిధులు రూ.9 లక్షల అంచనా వ్యయంతో ఆధునీకరించబడిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం భవనాన్ని, అదనపు కౌంటర్లను ఎంఎల్ఎ సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో సహకార సంఘాలు మరింత బలోపేతమయ్యాయని తెలిపారు. రైతుల సంక్షేమం, అభివృద్ధికి జగనన్న ఎనలేని కషి చేస్తున్నారన్నారు. 5 ఏళ్ల క్రితం నందిగామ ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం రూ.10 కోట్ల టర్నోవర్‌లో ఉందని, ఈ నాలుగేళ్లలో రూ.19 కోట్ల టర్నోవర్‌ను సాధించిందని తెలిపారు. 5 ఏళ్ళ క్రితం రూ.40 లక్షల అప్పుతో కొనసాగిన సొసైటీ నేడు రూ.39 లక్షల ఆదాయంతో లాభాల బాటలో నడుస్తుందన్నారు. కమర్షియల్ బ్యాంకులతో పోటీపడుతూ కెడిసిసిబి రుణాలను అందిస్తుందని తెలిపారు. కేవలం రైతులకే కాకుండా కర్షక మిత్రా, ఎల్.టి, విద్యా, వ్యాపార రుణాలను తక్కువ వడ్డీకే ఇతరత్రా రుణ సదుపాయాలను కల్పిస్తుందని పేర్కొన్నారు. శాసనసభ్యులు మొండితోక జగన్ మోహన్‌రావును సొసైటీ చైర్మన్, డైరెక్టర్లు, మేనేజర్, పలువురు రైతులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ మస్తాన్, వైస్ చైర్మన్ లక్ష్మీ, మాజీ సొసైటీ అధ్యక్షులు చిరుమామిళ్ళ చైతన్య కుమార్, డైరెక్టర్‌లు, మున్సిపల్ వైస్‌చైర్మన్, పలువురు రైతులు, మేనేజర్, సిఇఒ పాల్గొన్నారు.

ట్యాబ్‌లు పంపిణీ

ప్రజాశక్తి - వీరులపాడు : విద్యావ్యవస్థలో పెను మార్పులు తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కిందని ఎంపిపి కోటేరు లక్ష్మి పేర్కొన్నారు. వీరులపాడు మండలం జయంతి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ బతుకులు మారాలంటే, తలరాతలు మారాలి, తలరాతలు మారాలంటే చదువు అనే ఆయుధం ద్వారానే మారుతుందని నమ్మిన ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు డిజిటల్ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టి భవిష్యత్తులో వారు ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మారపాక మహాలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు ఇప్పల సత్యనారాయణ రెడ్డి సొసైటీ అధ్యక్షులు జంగా కోటిరెడ్డి వైఎస్ఆర్ సీపీ నాయకులు ఇప్పల కష్ణారెడ్డి మారపాక శ్రీనివాసరావు సాంబిరెడ్డి పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : ప్రముఖ దినపత్రిక 'ప్రజాశక్తి' కేలండర్‌ను ఎంపిపి రామినేని దేవిప్రవిణ్య వీరస్వామినాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చి వాటిని పరిష్కరించేందుకు తగిన విధంగా కషి చేసే పత్రిక ప్రజాశక్తి అని అన్నారు. పత్రికలు, పాత్రికేయులు వాస్తవాలను మాత్రమే రాయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి చాట్ల రాబర్ట్, సర్పంచి మల్లాది రాణి, రంగాపురం సర్పంచ్ పడిశాల సునీల, వైసిపి సీనియర్ నాయకుడు రామినేని వీరస్వామినాయుడు, వెంకటరెడ్డి, అన్నేరావుపేట ఎంపిటిసి సభ్యులు శెట్టపల్లి మాధవిలత, రాము తదితరులు పాల్గొన్నారు.


కేలండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

పలు పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - తిరువూరు : సంక్రాంతి సంబరాలను తెలుగు వారి సాంప్రదాయ పండుగలో ఒకటైన సంక్రాంతిని నాగార్జున పాఠశాలలో ఆనందోత్సవాలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. చిన్నారులకు భోగి పండ్లు పోశారు. హరిదాసు, రైతు వేషధారణలతో విద్యార్థులు చూపరులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, ముగ్గుల పోటీ నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్ వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ కె.నరసింహారావు, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.సురేష్, కళాశాల డైరక్టర్స్ కె.శేషగిరిరావు, డి.హనుమంతురావు, టి. సూరి బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు. **నందిగామ :** నందిగామ రైతు పేట శ్రీ చైతన్య పాఠశాలలో సంక్రాంతి సంబరాలు సోమవారం ఉత్సాహభరితంగా జరిగాయి. పాఠశాల ఆవరణలో పల్లెటూరి వాతావరణం ముట్టిపడేలా గుడిసెలు నిర్మించి వివిధ రంగవల్లికలతో అలంకరించారు. ప్రిన్సిపల్ గుత్తా ప్రదీప్ పేర్కొన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా పాఠశాల ఆవరణలో ముగ్గుల పోటీలు, గాలిపటాల తయారీ, వాలు జడ పోటీలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయ తర సిబ్బంది ఎజిఎం మురళీకష్ణ, ఆర్ఐ వినోద్ ఈ కార్యక్రమంలో పాల్గొని వివిధ విభాగాల్లో బహుమతులు పొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు.


మైలవరంలో సంక్రాంతి వేడుకల్లో చిన్నారులు

కంచికచర్ల : స్థానిక ఉషోదయ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో సోమవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు.. ఈ సందర్భంగా పిల్లలు ముగ్గులు, సాంప్రదాయ పిండి వంటల పోటీలు, బొమ్మల కొలువు, బోగి మంటలు వేసి సంక్రాంతి పాటలకు నృత్యాలతో అందరినీ అలరించారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరెస్పాండెంట్ కుర్రా కిరణ్ కుమార్, డైరక్టర్ కుర్రా హరీష్, ప్రిన్సిపాల్ కటారపు రాజేంద్ర, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. **నందిగామ :** నందిగామ మండలం పెద్దవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పాఠశాలలో ముగ్గుల పోటీలు, గాలిపటాలు ఎగురవేశారు. విద్యార్థులకు ఆట పాటలు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పాఠశాల హెచ్.ఎం.శ్రీనివాస్ ప్రసాద్, ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులు, పిజికల్ డైరెక్టర్, సిబ్బంది పాల్గొని విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. **మైలవరం :** స్థానిక లీలావతి పబ్లిక్ స్కూల్లో సోమవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించేలా విద్యార్థులు పంచెకట్టు వేషధారణలతో అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉడత లక్ష్మీనారాయణ సంక్రాంతి ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు.

బిల్కిస్ బానో కేసులో సుప్రీం తీర్పు హర్షణీయం

ప్రజాశక్తి - వన్‌టౌన్

బిల్కిస్ భాను కేసులో గుజరాత్ బిజెపి ప్రభుత్వ నిర్ణయం చెల్లదని సుప్రీం ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ సోమవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. 2002లో గుజరాత్ అల్లర్లలో బిల్కిస్ బానోపై అత్యాచారానికి ఒడిగట్టిన రేపిస్టులను విడుదల చేస్తూ గుజరాత్ ప్రభుత్వం గత ఏడాది నిర్ణయం తీసుకుంది. రేపిస్టులను విడుదలచేసే అధికారం గుజరాత్ ప్రభుత్వానికి లేదని, ధర్మాసనం ఖరాకండిగా చెప్పిందని ఈ ప్రకటనలో తెలిపారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు భారత రాజ్యాంగ, ప్రజాస్వామ్య హక్కుల' పరిరక్షణకు ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు.

17న వేప కలప బహిరంగ వేలం

ప్రజాశక్తి వత్సవాయి : ఇటీవల వత్సవాయి జిల్లా పరిషత్ హై స్కూల్ లో నరికి వేసిన ఐదు వేప చెట్ల కలపను 17న వత్సవాయి జిల్లా పరిషత్తు హై స్కూల్‌లో వేలంపాట నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఒక ప్రకటనలో సోమవారం తెలిపారు. మండల స్థాయిలో జరగబోయే ఆడుదాం- ఆంధ్ర కార్యక్రమం కోసం, ఫోర్ వే ట్రాక్ నిర్మాణం కోసం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో ఆటంకంగా ఉన్న ఐదు వేప చెట్లను తల్లిదండ్రుల కమిటీ తీర్మానం మేరకు నరికి వేసినట్లు తెలిపారు. ఆ వేపకలపను వేలంపాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వికసిత భారత్ యాత్రను జయప్రదం చేయండి : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ఈ నెల 9 నుండి 11వ తేదీ వరకు కేంద్ర పర్యాటక శాఖ మంత్రి శ్రీపాద యశో నాయక్ పాల్గొంటున్న వికసిత భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో డిఆర్వో పెద్దిరోజా, ఉయ్యూరు ఆర్డిఓ పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ డి రాజు, ముడా విసి రాజ్యలక్ష్మితో కలిసి స్పందన కార్యక్రమం నిర్వహించి వివిధ ప్రాంతాల ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం పరిశీలించేందుకు కేంద్ర



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

పర్యాటక శాఖ మంత్రివర్యులు శ్రీపాద యశోనాయక్ ఈనెల 9వ తేదీన జిల్లాకు వస్తున్నారన్నారు. ఆరోజు మధ్యాహ్నం 2.30 గంటలకు గుడ్లవల్లేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అలాగే 10 తేదీన ఉదయం కోడూరు మండల కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో, మధ్యాహ్నం పామర్రు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, 11వ తేదీన బంటుమిల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగే వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.జిల్లాలోని సంక్షేమ శాఖల అధికారులు, సంబంధిత ఇతర అధికారులు, ఆర్డీవోలు తహసీల్దార్లు, ఎంపీడీవోలతో జిల్లా పంచాయతీ అధికారి సమన్వయం చేసుకొని కేంద్ర మంత్రి పర్యటన కార్యక్రమం విజయవంతం చేయాలని సూచించారు.అంతకు ముందు జిల్లా కలెక్టర్ ప్రజల నుండి విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారుల పాల్గొన్నారు.



కోర్టు నిర్మాణ పనులు చేపట్టాలని వినతి

ప్రజాశక్తి-గన్నవరం

గన్నవరంలో కోర్టు నూతన నిర్మాణ పనులు చేయించాలని అమరావతి సచివాలయంలో న్యాయ కార్యదర్శి సత్య ప్రభాకర్ కు వినతిపత్రాన్ని అందజేసినట్లు గన్నవరం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తిరివిధి వెంకయ్య జనరల్ సెక్రటరీ తాతారావు తెలిపారు. కోర్టు భవనం నిర్మాణ పనులు చేపట్టని కారణంగా ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. కోర్టు భవనానికి శంకుస్థాపన చేసి ఏళ్ళు గడుస్తున్నా ఇంతవరకు పనులు కార్యరూపం దాల్చలేదని ఆయన దృష్టికి తెచ్చినట్లు తెలిపారు. దీనికి సత్య ప్రభాకర్ సానుకూలంగా స్పందించడం జరిగిందన్నారు.

వ్యాసరచన పోటీలు


ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: కవిరాజు త్రిపురనేని రామస్వామి జయంతి, వర్ధంతిని పురస్కరించుకుని యంగ్ హార్ట్స్ గ్రూప్ ఆధ్వర్యంలో కవిరాజు గూర్చి నేటి తరానికి తెలిసేలా మండలంలోని అంగలూరు ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలలో 6 నుండి 10 వ తరగతి మరియు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థినిలకు నేటి ఆధునిక పరిజ్ఞానంపై వ్యాస రచన పోటీలను నిర్వహించారు. ప్రతీ తరగతి నుండి ప్రథమ మరియు ద్వితీయబహుమతులు ఎంపిక చేసి బహుమతులు అందించనున్నట్లు యంగ్ హార్ట్స్ మెంబెర్ త్రిపురనేని హితేష్ తెలిపారు. మరియు అయిన జయంతిని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జి.ఓ ప్రకారము ఈ సంవత్సరం కూడా అధికార దినంగా నిర్వహించాలని కోరారు.ఈ కార్యక్రమంలోప్రధాన ఉపాధ్యాయులు జి.జగన్మోహన్ రావు ఉపాధ్యాయులు వి.మంజుల , గ్రామ ఉప సర్పంచ్ త్రిపురనేని సురేష్ పరివేక్షణలో పోటీలు నిర్వహించారు.

టిడ్కో కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి : సిపిఎం

ప్రజాశక్తి-గుడివాడ: గుడివాడ టీడ్కో కాలనీలో సరైన మౌలిక వసతులు ప్రభుత్వం కల్పించడంలో విఫలం అయిందని, వెంటనే మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి ఆర్ సి పి రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం పార్టీ నాయకులు టిడ్కో కాలనీలో సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్ సి పి రెడ్డి మాట్లాడుతూ వేలాదిమంది నివాసం ఉంటున్నారు కానీ అక్కడ నేటికి ప్రధానంగా మంచినీటి సమస్యతో పలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంతే కాకుండా విపరీతంగా దోమలు కుట్టడం, డ్రైనేజీ పారుదల సరిగా లేకపోవడం, వీధిలైట్లు లేక దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వం వాటర్ ట్యాంక్ పూర్తి చేయకుండా ప్రారంభించడం రీత్యా అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలనీవాసులు, వద్ధులు పెన్షన్ తీసుకోవటానికి వంద రూపాయలు ఖర్చుపెట్టుకుని గుడివాడకు రావలసిన పరిస్థితి వస్తుందన్నారు. కాబట్టి రేషన్, పింఛన్లు వాలంటరీల ద్వారా కాలనీలోనే ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఒక్కొక్క బ్లాక్ కి బోర్వెల్ వేయాలని ట్యాంకులతో వాటర్ సప్లై చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుడివాడ ఐద్వా కార్యదర్శి పి రజిని, సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు రేపానికొండ తదితరులు పాల్గొన్నారు.

హాకీ స్టిక్స్ అందజేత

ప్రజాశక్తి-గూడూరు: గూడూరు మండలం గూడూరు జిల్లా పరిషత్ హైస్కూల్ 1984-85 పూర్వ విద్యార్థులు సోమవారం విద్యార్థిని, విద్యార్థులకు రూ.25 వేలు విలువ కలిగినవి హాకీ స్టిక్స్ అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని విద్యార్థులకు సూచించారు. క్రీడలు శారీరక ఎదుగుదలకు, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని డి పుష్పలత పి డి అరుణ, పెనుగొండ శ్రీనివాసరావు, కుమార్ మాస్టారు, బత్తిన పెద్ద కాంతారావు, మారయ్య, అయూబ్, అడ్డాలనెహ్రూ, అన్నవరం పాటశాల సిబ్బంది పాల్గొన్నారు.



అలరించిన సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-ఉయ్యూరు: ఉయ్యూరు ఇంగ్లీషుమీడియం స్కూల్లో సోమవారం నిర్వహించిన సంక్రాంతి సం బరాల్లో సంక్రాంతి శోభ సంతరించుకుంది. సాంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు వివిధ అంశాల పోటీల్లో పాల్గొన్నారు. పండుగ ఉట్టిపడేలా విద్యార్థినుల ముగ్గులు, పిండి వంటలు, చిన్నారులకు బోగిపళ్ల పోశారు. స్కూల్ డైరెక్టర్ ఎంకె బాబు ఈసందర్భంగా మాట్లాడుతూ సంక్రాంతి పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలియజేసేలా పలు కా ర్యక్రమాలు నిర్వహించగా ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు.



'పంటలను ఈక్రాప్‌లో నమోదు చేసుకోవాలి'

ప్రజాశక్తి-పెదన: మండల పరిధిలోని ఆరుతడి పంటలైన మినుము, వేరుశనగ రైతులు ఈ క్రాప్ లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి జీవి శ్రీనివాసరావు సూచించారు. సోమవారం మండల పరిధిలోని పెనుమల్లి, నేలకొండపల్లి గ్రామా లోని ఆరుతడి పంటలను ఆయన పరిశీలించారు అనంతరం ఆయా గ్రామాల రైతులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ తమ పంట వివరాలను ఈ క్రాప్ లో నమోదు చేసుకోవాలి. దీనివలన ప్రభుత్వం ప్రభుత్వం రైతులకు సున్నా వడ్డీతో రుణాలు, భరోసా, పంట బీమా, నష్టపరిహారం, ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు సబ్సిడీ వంటివి పొందవచ్చు అన్నారు. అనంతరం మినుము పంటకు ఆశించే చీడ, పీడల గురించి రైతులకు పలు సూచనలు సలహాలు చెప్పారు. రైతులకు సందేహాలను తీర్చేందుకు ఆయా రైతు భరోసా కేంద్రాల్లో ఉన్న సిబ్బందిని అడిగి తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పెనుమల్లి భరోసా కేంద్ర సలహాదా రు శిరీష రైతులు పాల్గొన్నారు.





నిరసన తెలుపుతున్న ఆక్వా రైతులు

ఆక్వా రైతుల నిరసన

ప్రజాశక్తి-మోపిదేవి: జగన్ మోసపూరిత చర్యతో ఒక్కో రైతుకు సగటున నెలకు రూ.25వేలు భారం పెరిగి ఆక్వా సాగు నష్టాలతో రైతులను ఇబ్బంది పెడుతుందని టిడిపి, జనసేన నాయకులు సోమవారం మోపిదేవిలో తాసిల్దార్ కార్యాలయం ముందు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన విద్యుత్ సబ్సిడీ హామీ ఏమైంది? అని ప్రశ్నించారు. మోపిదేవి మండలం పెద్దకళ్ళేపల్లి ఆక్వా రైతుల ఈ నిరసన లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మోపిదేవి తహసీల్దారుకు జనసేన కష్ణాజిల్లా అధ్యక్షులు బండ్రెడ్డి రామకష్ణ టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు మండలి వెంకట్రామ్ రైతులకు సబ్సిడీ మంజూరు చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు రూ.2కు కరెంట్ ఇస్తే జగన్ రూపాయిన్నరకే ఇస్తా అన్నారు కానీ అధికారంలోకి వచ్చి రూ.4.60లకు పెంచేశారు ఇలాంటి విధ్వంసకర చర్యలతో జగన్ పాలనలో ఆక్వా సాగు తగ్గిపోయింది మరోపక్క రొయ్యల మేత దాన రేట్లు విపరీతంగా పెంచేశారు రైతుల నుంచి ఆగ్రహం ఎక్కువ అవుతుండడంతో నిబంధనలు మార్చి కొంతమందికే సబ్సిడీ వర్తించేలా షరతులు పెట్టి ఇదిగో మేము సబ్సిడీ ఇస్తున్నామని ఆర్భాటం చేస్తున్నారని విమర్శించారు. అన్ని గ్రామాల ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ ఇవ్వడంతోపాటు రొయ్యల ధరలను స్థిరీకరించి ఆక్వా సాగుకు పూర్వ వైభవం తీసుకురావాలని తెలుగుదేశం జనసేన శ్రేణులు డిమాండ్ చేశాయి.



విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

ఈ నెల 4, 5, 6 తేదీల్లో రాష్ట్రస్థాయి ఆటల పోటీలు అనంతపురం పాలిటెక్నిక్ కాలేజీలో నిర్వహించగా స్థానిక ఎ.ఎ.ఎస్.ఎమ్ అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్ పాలిటెక్నిక్ గుడ్లవల్లేరు విద్యార్థులు ఓవరాల్ ఛాంపియన్ షిప్ ను సొంతం చేసుకున్నారు. బాలికల గేమ్స్ వాలీ బాల్, టేబుల్ టెన్నిస్ డబుల్స్ అండ్ సింగిల్స్ విభాగాలలో విన్నర్స్ గా నిలిచారు. అదేవిధంగా బాలికల స్పోర్ట్స్ విభాగం రన్నింగ్ లో 200 మీ, 800 మీ. విభాగాలలో మొదటి స్థానం, 100 మీ, 100 మీx4 రిలే లో ద్వితీయ స్థానాన్ని, 400 మీ, ట్రిపుల్ జంప్, విభాగాలలో తతీయ స్థానాన్ని సాధించారు. అదేవిధంగా బాలుర గేమ్స్ ఓవరాల్ ఛాంపియన్ షిప్, బాలుర గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ఓవరాల్ ఛాంపియన్ షిప్ ను సొంతం చేసుకోగా, బాలుర గేమ్స్ కబడ్డీ, బాల్ బాడ్మింటన్ లో ద్వితీయ స్థానాన్ని, బాలుర స్పోర్ట్స్ విభాగం రన్నింగ్ లో 200 మీ, 800 మీ, మరియు 400 మీటర్లలో మొదటి స్థానాన్ని, 400 మీలో ద్వితీయ స్థానాన్ని, 1500 మీలో తతీయ స్థానాన్ని సాధించారు. ఈ సందర్భంగా బహుమతులను సాధించిన విద్యార్థిని, విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎన్. రాజశేఖర్ అభినందించారు. జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారని తెలియజేశారు. బహుమతులు సాధించిన విద్యార్థులకు శిక్షణను అందించిన ఫిజికల్ డైరెక్టర్ వి.శ్రీనివాసరావును, సహాయ ఫిసికల్ డైరెక్టర్ ఎం.భవదీప్,మెకానికల్ బ్రాంచ్ జూనియర్ ఇన్స్ట్రక్టర్ కె.పిచ్చయ్యలను ఛైర్మన్ డా. వల్లూరుపల్లి నాగేశ్వరరావు , సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ వి.సత్యనారాయణరావు తదితరులు అభినందించారు.

3డి ప్రింటింగ్ మెషిన్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: అజాక్స్ ఇంజనీరింగ్ సంస్థ ఆధ్వర్యంలో 3డి కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీని ఆవిష్కరించినట్లు సంస్థ నిర్వాహకులు కె.బి. రాజు తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. కాంక్రీట్ పరికరాల తయారీలో అగ్రగామిగా ఉన్న అజాక్స్ ఇంజనీరింగ్ తన సొంత 3డి కాంక్రీట్ ప్రింటింగ్ మెషీన్ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. సాంప్రదాయ నిర్మాణ పద్ధతులు సాధారణంగా ఇలాంటి ఇంటిని నిర్మించడానికి నెలల తరబడి డిమాండ్ ఉంటుంఉదన్నారు. వేగవంతమైన ఖర్చుతో కూడుకున్న, పర్యావరణ పరంగా స్థిరమైన ప్రత్యామ్నాయాలను అందించడం ద్వారా త్వరగా వేగంగా నిర్మాణాన్ని అందిస్తుందని తెలిపారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): జనవరి 26న నిర్వహించబోయే భారత గణతంత్ర దినోత్సవ వేడుకలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్ లోని స్పందన సమావేశపు మందిరంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో జరగనున్న జిల్లాస్థాయి గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ అవసరమైన ఏర్పాట్లను చేయాలన్నారు.పోలీస్ పెరేడ్ గ్రౌండ్ ను సిద్ధం చేయడంతో పాటు పోలీస్ బ్యాండ్, జెండా ఆవిష్కరణ వేదిక, బందోబస్తుకు తగిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలు ప్రతిబింబించేలా శకటాలు, స్టాల్స్ ఏర్పాట్లకు ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. మెరిటోరియస్ సర్టిఫికెట్ల కోసం సిఫారసులను, ఎలాంటి జాప్యం చేయకుండా ముందుగానే అన్ని శాఖల అధికారులు పేర్లను జిల్లా రెవెన్యూ అధికారికి పంపించాలని, అవార్డు గ్రహీతలు సాధించిన పనితనం గురించి సంక్షిప్తంగా తెలియజేయాలన్నారు.పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారిణి పెద్ది రోజా, ఏ ఎస్ పి (ఏఆర్) ప్రసాద్, ఆర్డీవో ఎం వాణి, మున్సిపల్ కమిషనర్ చంద్రయ్య, డ్వామా పీడీ జీవి సూర్యనారాయణ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి - మైలవరం : మండలంలోని చిలుకూరు వారి గూడెం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు వైసిపి నాయకులు మాడపాటి శ్రీనివాసరావు సహకారంతో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ఆధ్వర్యంలో ముద్రించిన పదో తరగతి స్టడీ మెటీరియల్ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కె.గంగరాజు మాట్లాడుతూ దాతల సహకారంతో అందజేసిన స్టడీ మెటీరియల్ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మైలవరం మండల ప్రధాన కార్యదర్శి వి.వసంతరావు, ప్రధానోపాధ్యాయులు నారాయణరావు, యుటిఎఫ్ నాయకులు రత్నకమల్, రామ్ కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాల్లో విజయం

ప్రజాశక్తి - తిరువూరు : జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో ఎ.కొండూరు మండలం కంభంపాడు విద్యార్థులు తృతీయ స్థానం సాధించారు. విజయవాడలోని శరత్ చంద్ర ఐఎఎస్ అకాడమీలో ఆదివారం జనవిజ్ఞానిక వేదిక ఆధ్వర్యంలో జరిగిన ఎన్టీఆర్ జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ విద్యార్థులను సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె.ఆదిశేషు, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్ అభినందించారు.

వైసిపి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : రానున్న ఎన్నికల్లో వైసిపి ఘన విజయం ఖాయమని వైసిపి పశ్చిమ ఇన్‌ఛార్జి షేక్ ఆసిఫ్ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం పంజాసెంటర్ సమీపంలో వైసిపి వెస్ట్ ఇన్‌ఛార్జి కార్యాలయాన్ని ఆసిఫ్, వైసిపి నాయకులు, కార్యకర్తల ఆనందోత్సాహాల మధ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మీడియాతో మాట్లాడుతూ ప్రజారంజకంగా సీఎం జగనన్న పాలన వుందన్నారు. వైనాట్ 175 నినాదం నెరవేరనుందని అన్నారు. గత టీడీపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అణగారిన వర్గాలను మోసం చేశారని, జగన్ అన్ని సామాజిక వర్గాలకు సమ న్యాయం చేశారని అన్నారు. విజయవాడలో అంబేద్కర్ స్మృతి వనంలో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ ఈ నెల 19 న జరుగుతుందని, సీఎం జగన్ ఈ కార్యక్రమంలో పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరిస్తారన్నారు. ఈ సమావేశంలో వైసీపీ నగర ఎస్సీ సెల్ అధ్యక్షులు బూదాల శ్రీనివాసరావు మాట్లాడారు. సమావేశంలో పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

వంగవీటి రంగా కాంస్య విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి మైలవరం : మైలవరంలోని పాత ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో వంగవీటి మోహనరంగా విగ్రహావిష్కరణ కార్యక్రమం సోమవారం సాయంత్రం ఘనంగా జరిగింది. స్థానిక శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం నుండి మైలవరం వరకు బైక్ ర్యాలీ తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, కాపు సంఘం నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్, వైసిపి నాయకులు కార్యకర్తలు రంగా అభిమానులు పాల్గొన్నారు.

సాహస బాలుడికి యుటిఎఫ్ అభినందన

జగ్గయ్యపేట: మండలంలోని మల్కాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుచున్న సూరపల్లి రాజేష్ గత నెలలో మల్కాపురం గ్రామంలో ప్రమాదవశాత్తు బావిలో పడిన ఒక మహిళను కాపాడిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న యుటిఎఫ్ నాయకులు పాఠశాలలో ప్రధానోపాధ్యాయుల సమక్షంలో రాజేష్‌ను అభినందించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా సహాధ్యక్షులు ఎం.కష్ణయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.వి.నాగేశ్వరరావు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జె.సుధానంద్, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.పల్లవి, జి.ముక్తేశ్వరరావు జిల్లా కౌన్సిల్ సభ్యులు అల్లిక.నరసింహారావు, యుటిఎఫ్ సభ్యులు జి.శేఖర్ పాల్గొన్నారు.

ప్రజలపై ఎడాపెడా పన్నులు

జగ్గయ్యపేట: ఎడాపెడా పన్నులతో ప్రజలను ఇబ్బంది పెడుతున్న వ్యక్తి జగనే అని, జగన్ ప్రభుత్వానికి నూకలు చెల్లే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని ఎన్‌టిఆర్ జిల్లా టిడిపి అధ్యక్షులు నెట్టెం రఘురాం విమర్శించారు. పట్టణంలోని తన నివాసంలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఒక్కడి వల్ల ఒక రాష్ట్రం, కోట్లాదిమంది ప్రజలు ఇంతగా నష్టపోయినట్లు చరిత్రలో ఎక్కడా లేదన్నారు. ఎడాపెడా పన్నులతో ప్రజలతో రక్తం పీల్చుతున్నారన్నారు. అన్నాక్యాంటీన్, పెళ్లికానుక రద్దు చేశారన్నారు. విజయవాడ నియోజక వర్గ నాయకుడు ఎం.ఎస్.బేగ్ రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రీవెన్స్ సెల్ కో కన్వీనర్ ముల్లంగి రామకృ ష్ణారెడ్డి, నూజివీడు నియోజకవర్గ రాష్ట్ర పార్టీ పరిశీలకుడు గింజుపల్లి రమేష్, మండల పార్టీ అధ్యక్షుడు కట్టా వెంకట నరసింహారావు, తదితరులున్నారు.

ఆరోగ్య కేంద్ర భవనం, గోదాము ప్రారంభం


గోదామును ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ వసంత, తదితరులు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : .కొటికలపూడి గ్రామంలో వైఎస్ఆర్ గ్రామీణ ఆరోగ్య కేంద్ర భవనం, ఉద్యాన సేకరణ గోదామును ప్రారంభించిన అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే వసంత కష్ణప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు చూసి ఓర్వలేక నిరాధార ఆరోపణలతో తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నాడన్నారు. దేవినేని ఉమామహేశ్వరరావు తనపై చేసిన ఆరోపణలను నిరూపించాలని, నిరూపించకపోతే క్షమాపణలు చెప్పాలని, లేదా న్యాయస్థానంలో పరువునష్టం దావాను ఎదుర్కోవాలని స్పష్టం చేశారు. దీనికి సంబంధించి లీగల్ నోటీసులకు అతను సమాధానం ఇవ్వలేదన్నారు. తాజాగా పాత పేపర్ క్లిప్పింగ్స్‌తో సోషల్ మీడియాలో మరో బూటకపు ప్రచారానికి తెరలేపాడన్నారు. వీటిని కూడా కోర్టు దష్టికి తీసుకెళ్తామని అన్నారు. చట్టప్రకారం తను తదుపరి చర్యలకు ఉపక్రమిస్తానని స్పష్టం చేశారు.

గ్రాఫ్ థియరీలో దుర్గావతికి పిహెచ్‌డి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : స్థానిక ఆర్‌కె కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామకష్ణయ్య ఆధ్వర్యంలో గ్రాఫ్ థియరీలో చేసిన పరిశోధనకు గానూ శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల గణిత అధ్యాపకురాలు పున్నెబోయిన వెంకట దుర్గావతి కృష్ణ విశ్వవిద్యాలయం నుంచి గణిత విభాగంలో పిహెచ్‌డి పొందారు. ఆర్‌కె కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామకృష్ణయ్య సలహాలు సహకారంతో పిహెచ్‌డి పొందినట్లుగా దుర్గావతి తెలిపారు. ఆమె గ్రాఫ్ థియరీలో సమ్ స్టడీస్ ఆన్ సైన్డ్ యూని డామినేటింగ్ అండ్ సైన్డ్ యూని డామినేటింగ్ ఫంక్షన్స్ ఆఫ్ రూటేడ్ ప్రోడక్ట్ గ్రాఫ్ అనే అంశం మీద తన పిహెచ్‌డిని పూర్తి చేశారు. ఒక గహిణిగా ఉంటూ ఉద్యోగం చేస్తూ పట్టుదలతో కషి చేసి పిహెచ్‌డి పొందినందుకు దుర్గావతికి అభినందనలు తెలిపారు.

నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని దీక్షలు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఎన్‌జెఎసి నాయకుడు, ఎన్‌ఎఫ్ఐఆర్, ఎస్‌సిఆర్ఇఎస్ జనరల్ సెక్రటరీ డాక్టర్ మర్రి రాఘవయ్య పిలుపు మేరకు గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్ షాపు మెయిన్ గేటు వద్ద ఎంప్లాయిస్ సంఘ్ ఆధ్వర్యంలో సోమవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వర్క్ షాప్స్ డిప్యూటీ డివిజనల్ సెక్రటరీ, బ్రాంచి కార్యదర్శి గద్దా సురేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైల్వే కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తుందని దుయ్యబట్టారు. నూతన పెన్షన్ విధానం అమలు వల్ల వర్క్‌షాపులో 60 శాతం కార్మికులకు అన్యాయం జరుగుతుందన్నారు. రాజకీయ నాయకులు ఒక్కసారి ఎమ్మెల్యే గానీ, ఎంపిగా కాని ఎన్నికై వారి జీవితాంతం రూ.లక్షల పెన్షన్లు తీసుకుంటున్నారని చెప్పారు. రైల్వేలో పనిచేసే కార్మికులు తమ రక్తాన్ని చెమటగా మార్చి రైల్వేలను అభివద్ధి బాటలో నడిపించి, రిటైర్డ్ అయిన తరువాత కుటుంబాలను పోషించుకోవడం అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించి ఉద్యోగ విరమణ చేసిన కార్మికుల జీవితాలను మెరుగుపర్చాలని, వారి కుటుంబాల్లో ఆనందం నింపాలని కోరారు. రైల్వేల ప్రైవేటీకరణను ఆపాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, కార్మికులపై పని భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. రిలే దీక్షలకు ఎస్ సిఆర్ఎంయు, ఎస్‌సిఆర్ ఒబిసి అసోసియేషన్, ఆల్ ఇండియా ఎస్‌సి, అండ్ ఎస్‌టి అసోసియేషన్ సంఘీభావం తెలిపాయి. బ్రాంచి అధ్యక్షుడు పామర్తి శివనాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. బ్రాంచి వర్కింగ్ చైర్మన్ దాసరి డేవిడ్ రాజు, కోశాధికారి పి.విమల్ సాయి, జి.సుధాకర్, ఎస్.బోయాజ్, కె.లాలియా నాయక్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నెట్టెం రఘురాంను కలిసిన ఎంఎస్ బేగ్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : తిరువూరులో జరిగిన రా కదలిరా సభ విజయవంతం చేసినందుకు టిడిపి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు నెట్టెం రఘురాంను జగ్గయ్యపేటలోని ఆయన నివాసంలో టిడిపి విజయవాడ పశ్చిమ మైనార్టీ నాయకులు ఎంఎస్.బేగ్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. రఘురాంను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా పార్టీ కార్యాలయం కార్యదర్శి సారిపల్లి రాధాకృష్ణ పాల్గొన్నారు.

వైసిపికి గుదే కుటుంబం రాజీనామా


మాట్లాడుతున్న రంగారావు

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల మండలం గొట్టుముక్కల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, సీనియర్ వైసిపి నాయకుడు గుదే రంగారావు కుటుంబ సభ్యులు ఆ పార్టీకి రాజీనామా చేశారు. సోమవారం కంచికచర్లలో గుదే రంగారావు, ఆయన సతీమణి ఎంపిటిసి గుదే సరస్వతి, కుమారుడు గుదే బుజ్జి ఇతర కుటుంబ సభ్యులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొలి నుంచి కాంగ్రెస్ పార్టీలోనూ, తర్వాత వైసిపిలోనూ గ్రామ సర్పంచ్‌గా, ఉప సర్పంచ్‌గా రాజకీయంగా గ్రామంలో క్రియాశీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. 2019 నుండి గ్రామాభివద్ధికి నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్‌రావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ సహకారం మరువలేనిదన్నారు. కొన్ని వ్యక్తిగత కారణాలతో పాటు, వయసు రీత్యా రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు గుదే రంగారావు తెలిపారు. ఆయనతో పాటు ఎంపిటిసి గుదే సరస్వతి ఎంపిటిసి పదవికి కూడా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఎంపిటిసి పదవికి రాజీనామా చేస్తూ, రాజీనామా పత్రాన్ని ఎంపిడివోకు పంపుతున్నట్లు తెలిపారు. అయితే వైసిపి ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి రాజకీయాలకు దూరంగానే ఉంటామన్నారు. తమ కుటుంబం టిడిపిలోకి చేరుతున్నట్లు వస్తున్న కథనాలను ఖండించారు.

అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగం దుర్మార్గం

సంఘీభావంలో రాజకీయ నాయకులు

28వ రోజుకు సమ్మె


విజయవాడ

ప్రజాశక్తి - విజయవాడ : ఎస్మాకు భయపడేది లేదు... కోర్కెలు సాధించుకునేంత వరకు అంటూ అంగన్‌వాడీలు నినదించారు. అత్యవసర సేవలు కింద పరిగణిస్తూ అంగన్‌వాడీల సమ్మెను విరమింప చేయాలని లేనట్లయితే ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 2కు వ్యతిరేకంగా, కోర్కెల సాధన కోసం సోమవారం ధర్నా చౌక్‌లో 28వ రోజు అంగన్‌వాడీల సమ్మెలో బాగంగా 24 గంటల దీక్షలు చేశారు. కనీస వేతనం 26 వేలు చేయాలని, గ్రాట్యూటీ మంజూరు చేయాలని, మినీ అంగన్‌వాడీలను అప్‌గ్రేడ్ చేయాలని, ఎస్మా చట్టాన్ని తక్షణం వెనుక్కి తీసుకోవాలని అంగన్‌వాడీలు చేసిన నినాదాలు హోరెత్తాయి. ఈ సమ్మెకు పలు కార్మిక, ప్రజాసంఘాల నేతలు పాల్గొని సంపూర్ణ సంఘీభావం తెలిపారు. బెఫి రాష్ట్ర కార్యదర్శి ఆర్ అజయ్‌కుమార్, ఐద్వా సీనియర్ నాయకులు, సిపిఎం మాజీ ఎమ్మెల్యే పుతుంబాక భారతి, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు, రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రనాద్, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి, ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు రవిచంద్ర, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జి నటరాజు, నిరుద్యోగ జెఎసి రాష్ట్ర కన్వీనర్ ఎస్‌కె సిద్ధిక్, టాక్స్ పేయర్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి సాంబిరెడ్డి, ఎంవి ఆంజనేయులు తదితరులు అంగన్‌వాడీల సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలిపి మాట్లాడారు. ఎస్మా చట్టం ప్రయోగించి అంగన్‌వాడీ ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేయాలనుకుంటే రాష్ట్రంలోని అన్ని రాజకీయపక్షాలు, కార్మిక, ఉద్యోగ, ప్రజాసంఘాలు వారికి అండగా నిలుస్తాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి బేబిరాణి, ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ సుప్రజ, నాయకులు గజలక్ష్మి, యల్లారాణి, సిఐటియు జిల్లా నాయకులు ఎ.వెంకటేశ్వరరావు, కె.దుర్గారావు, ఎంవి సుధాకర్, ఇతర నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మైలవరం : అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న సమ్మెలో భాగంగా స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, అంగన్వాడీల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో మైలవరం, ఇబ్రహీంపట్నం, జి.కొండూరు మండలాల సిఐటియు కార్యదర్శి సిహెచ్.సుధాకర్, ఎం.మహేష్, కె.బాలకష్ణ, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు పుష్ప కుమారి, శారద మైలవరం జి.కొండూరు రెడ్డిగూడెం ఇబ్రహీంపట్నం మండలంలోని అంగన్వాడీలు అంగన్వాడీ హెల్పర్లు పాల్గొన్నారు.

నందిగామ : నందిగామలో అంగనవాడీ వర్కర్స్ సోమవారం గుంజీలు తీస్తూ నిరసన తెలిపారు. అంగన్వాడీల సమ్మె 28వ రోజు కొనసాగుతుంది.

తిరువూరు : అంగన్వాడీలు ఎస్మా అక్షర రూపంలో కూర్చొని నిరసన తెలిపారు. **జగ్గయ్యపేట:** పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద కొనసాగింది. ఈ సందర్భంగా అంగన్వాడీలు కోలాటం వేసి నిరసన తెలిపారు.


మైలవరంలో


తిరువూరులో


జగ్గయ్యపేట

అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగం దుర్మార్గం : నేతలు

• 28వ రోజుకు సమ్మె • బంటుమిల్లిలో ఉరితాడుతో నిరసన

ప్రజాశక్తి-గన్నవరం : అంగన్వాడీలకు జీతాలు పెంచకుండా వారిపై ఎస్మా ప్రయోగించడం దారుణమని సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాల కష్ణారావు అన్నారు. గన్నవరం ఐసిడియస్ కార్యాలయం వద్ద నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్వాడీ సిబ్బందికి ఆళ్ళ వెంకట గోపాల కష్ణారావు, రాష్ట్ర తెలుగురైతు కార్యనిర్వాహక కార్యదర్శి గుండపనేని ఉమా వరప్రసాద్, బాపులపాడు మండల టి.డి.పి అధ్యక్షులు దయాల రాజేశ్వరరావు, మండల టి.డి.పి ప్రధాన కార్యదర్శి పుట్టా సురేష్ తదితరులు శిబిరానికి హాజరై మద్దతు తెలియజేశారు. మాజీ జడ్.పి.టి.సి సభ్యులు వేగిరెడ్డి పాపారావు, రైతు నాయకులు కలపాల రాధాకష్ణ, మజ్జిగ నాగరాజు, కొండపల్లి వెంకన్న, గార్లపాటి రాజేశ్వరరావు, చిలకపాటి శ్రీనివాసరావు, యనమదల శ్రీనివాసరావు, గన్నవరం నియోజకవర్గ ఎ.పి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు యస్.రమాదేవి, అంగన్వాడీ యూనియన్ నాయకురాళ్ళు జి.రజని, ఎ.కనకదుర్గ, యమ్.శాంతకుమారి, కె.ఉమాదేవి, గంటా.లక్ష్మి, సి.ఐ.టి.యు నాయకులు కళ్ళం వెంకటేశ్వరరావు, మురపా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కలక్టరేట్(కృష్ణా) :** అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కృష్ణాజిల్లా కమిటీ ఆధ్వర్యంలో మచిలీపట్నంలో చేపట్టిన సమ్మె సోమవారానికి 28వ రోజుకు చేరుకుంది. అలాగే 24 గంటల రిలే నిరాహారదీక్షలు మూడో రోజు కు చేరుకున్నాయి. ఈ సందర్భంగా టిడిపి,కాంగ్రెస్స్ నాయకులు సంఘీ భావం తెలిపారు.సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, కష్ణా జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ , డివిజన్ ఇంచార్జ్ దిలీప్ కుమార్, పంచ పర్వాల కాశీ విశ్వనాథం, లంకె శేషగిరి, కార్పొరేటర్ సమతా కీర్తి, మరకాని పరబ్రహ్మం, టౌన్ పార్టీ ప్రెసిడెంట్,ఇలియాస్ పాషా, రూరల్ పార్టీ ప్రెసిడెంట్ కుంచె నాని, కరెడ్ల సుశీల, లంకి శెట్టి నీరజ, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కె.చంద్ర శేఖర్ ,సంఘీ భావం తెలిపారు. ఈ సమ్మె లో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ రమాదేవి, సెక్టార్ అధ్యక్ష ,కార్యదర్శులు నాంచారమ్మ, పి.రెజీనా రాణి,సభ్యులు కే లక్ష్మి ,సుజాత, సౌజన్య విటలేశ్వరి, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంకిపాడు :** కంకిపాడులో నిర్వహించిన అంగన్‌వాడీల సమ్మెకు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి రంగారావు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్షులు నళిని కుమారి, ఎం రేవతి, సెక్టార్ లీడర్ రమాదేవి, సిహెచ్ విజయలక్ష్మి, ఎం కనకరత్నం, కాళిమ్మ, విజయలక్ష్మి, మేరాబి నాయకులు లక్ష్మీప్రసన్న,, భవాని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు తాడంకి నరేష్ మరియు ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ పాల్గొన్నారు.**ప్రజాశక్తి - మొవ్వ :** సమస్యలు పరిష్కరించాలని మొవ్వలో అంగన్వాడీలు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ర్యాలీగా అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకున్న అంగన్వాడీలు ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. **ప్రజాశక్తి-బంటుమిల్లి :** బంటుమిల్లిలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు మెడకు ఉరితాడు తగిలించుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలకు చెందిన అంగన్‌వాడీలు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** అవనిగడ్డ జనసేన పార్టీ నాయకులు గుడివాక శేషుబాబు అంగన్‌వాదీల సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలపడంతో పాటు వారి సమ్మెకు ఆర్థిక సహకారం అందించి దాతత్వం చాటుకున్నారు. దీక్ష శిబిరం వద్ద కావలసిన 25వేల రూపాయల విలువగల మూడు షామియానా టెంట్లను ఇతర సామాగ్రిని, కూర్చోవడానికి పరదా బాల్సును ఆయనే కొనుగోలు చేసి దీక్ష శిబిరం వద్ద ఏర్పాటు చేయించారు. కాగా సమ్మెలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బండి ఆదిశేషు, ధోనే సహదేవుడు, ఏడుకొండలు తదితరులతో పాటు యూనియన్ నాయకులు నిర్మల జ్యోతి, ఏ నాగమణి, గాదె సుశీల, కే పాములమ్మ, కాశి హంస, విజయ రాణి, ఎం సుధారాణి తదితరులు పాల్గొని సమ్మె నిర్వహిం చారు. కాగా జనసేన పార్టీ నాయకులు గుడివాడ శేషు బాబుతో పాటు గుడివాక రామాంజనేయులు తుంగల నరేష్ ఎంపీటీసీ బప్పన భాను మహిళా కార్యకర్తలు భోగాది రాజ్యలక్ష్మి తదితరులు సమ్మెలో పాల్గొని సంఘీభావం తెలిపారు.



మొవ్వలో...



అవనిగడ్డలో..



గన్నవరంలో...



కంకిపాడులో...



మచిలీపట్నంలో...

గుడ్లవల్లేరు ఫార్మసీ కళాశాల విద్యార్థిని ప్రతిభ



ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక వివి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసిటికల్ సైన్సెస్ కళాశాల విద్యార్థిని రైజ మెహజబిన్ ఈనెల 6, 7వ తేదీలలో అఖిలభారత అధ్యాపకుల సంఘం వారి అను సంధానంతో రాజమండ్రిలో నిర్వహించిన జాతీయ సదస్సులో పాల్గొని విజయం సాధించింది. బీఫార్మసీ నాలుగో సంవత్సరం చదువుతున్న మెహజబిన్ అధిక రక్త పీడనానికి వినియోగించే ఔషధాల మోతా దుని నిర్ణయించే పద్ధతులపై పోస్టర్ను ప్రదర్శించి మొదటి స్థానాన్ని సాధించింది. విజయం సాధించిన విద్యార్థినికి ప్రశంసా పత్రం, మెమెంటోతో పాటు మూడు వేల రూపాయల నగదు బహుమతి లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ లక్ష్మణ రావు తెలిపారు. విద్యార్థినిని కళాశాల ప్రిన్సిపల్ తో పాటు అధ్యాపకులు డా.ఎస్ అమీనాబి డా. పి. రవిషా డా. టి. ప్రశాంతి, డా. బి. మోహన్ గాంధీ డా. టి. బాలకష్ణ బి. సత్య శ్రీ, టి. శ్రావణి,విఎల్ వినోద్ కుమార్, ఎ.సాయి ధాత్రి,కె. పరిమళ అభినందించారు.



20వ రోజుకు సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

• బైక్ ర్యాలీ చేపట్టి నిరసన

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ఎన్నికల ముందు ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీల అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె సోమవారానికి 20వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (జెఎసి) జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల పి.పోతురాజు, ఎస్.శివ నాగరాజు లు మాట్లాడుతూ అధికారులు సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్స్ పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని హెచ్చరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఉద్యోగులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సమ్మెకు జనసేన నియోజక వర్గ ఇంఛార్జి బండి రామకష్ణ, సంఘీ భావం తెలిపిన ఈ సమ్మెలో ఈ సమ్మెలో ఉపాధ్యక్షులు ఎల్ రాజేష్ బాబు, ప్రోగ్రామింగ్ కో-ఆర్డినేటర్ ఎం.నాగార్జున, కోశాధికారి ఎం.ప్రశాంతి తో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎంఫిల్ డిగ్రీ అందజేత

ప్రజాశక్తి మచిలీపట్నంరూరల్ : కృష్ణా విశ్వవిద్యాలయం మచిలీపట్నంలోని రసాయనశాస్త్ర విభాగంలో పూర్తి సమయం పరిశోధన విద్యార్థిగా పనిచేస్తున్న కలకొండ సజినికి సూక్ష్మ రసాయనశాస్త్రంలో చేసిన పరిశోధనలకు గాను సోమవారం విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ జి. జ్ఞానమణి ఎం.ఫిల్ పట్టాను అందించారు. ఈ పరిశోదక విద్యార్థిని 'జింక్ ఆక్సైడ్ నానోపార్టికల్స్‌తో వితరణం చెందిన ద్రవ స్ఫటిక పారా.యన్. ఆక్టయిలోక్సీ బెంజోయిక్ యాసిడ్ సంశ్లేషణ మరియు లక్షణలు' అనే అంశంపై పరిశోధనలకు గాను ఈ పట్టాను పొందారు. కష్ణా విశ్వవిద్యాలయ రసాయనశాస్త్ర విభాగధిపతి డా.డి. రామశేఖరరెడ్డి పర్యవేక్షణలో ఆమె ఈ పరిశోధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా రసాయనశాస్త్ర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందితో పాటు, విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ జి. జ్ఞానమని, రిజిస్ట్రార్ పి. వీరబ్రహ్మాచారి, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వై.కె. సుందరక్రిష్ణ ఆమెను అభినందించారు.



కేలండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఐద్వా కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) కష్ణా జిల్లా కమిటీ ముద్రించిన 2024 నూతన సంవత్సర క్యాలండర్ ను సోమవారం స్పందన సమావేశ హాలులో జిల్లా విద్యాశాఖాధికారి, తాహెర సుల్తానా,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎన్.పద్మావతి,ఉద్యాన అధికారి జ్యోతి, సెరి కల్చర్ అధికారి, విజయలక్ష్మి, తాహసిల్దార్ శ్రీ విద్య,లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ బసవపూర్ణ, విజ్యోతి,పట్టణ అధ్యక్ష కార్యదర్శులు, సిహెచ్ విజయలక్ష్మి, కే సుజాత తదితరులు పాల్గొన్నారు.

పైడమ్మ ఆలయ హుండీ లెక్కింపు

ప్రజాశక్తి-పెడన : పట్టణ గ్రామదేవత శ్రీ పైడమ్మ అమ్మవారి ఆలయ ఉండి ఆదాయం ఆలయ ఈవో తిక్కిశెట్టి వీర వెంకట మోహన్ రావు ఆధ్వర్యంలో లెక్కింపులు సోమవారం జరిగాయి. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దాసు వాసు నందన్ రావు ట్రస్ట్ సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అమ్మవారి జాతరల నిమిత్తం రూ. 10 లక్షల 24 నేల 775 రూపాయలు ఆదాయం లభించింది. 11 రోజులపాటు జరిగిన ఈ జాతరలో సహకరించిన పోలీస్,పారిశుధ్య,విద్యుత్ లతోపాటు శాఖల అధికారులు సిబ్బందికి ఆలయ ఈవో తిక్కశెట్టి మోహన్రావు అభినందనలు తెలియజేశారు. ఈ లెక్కింపులో ఆలయ ధర్మకర్త సాంబశివరావు సిబ్బంది ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



హుండి ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

రైతుల ఆత్మహత్యల్లో రాష్ట్రం అగ్రస్థానం: యార్లగడ్డ

ప్రజాశక్తి-గన్నవరం : రైతు ఆత్మహత్యల్లో మన రాష్ట్రం దేశం అగ్రస్థానంలో ఉందని గన్నవరం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ యార్లగడ్డ వెంకట్రావు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రైతాంగ సమస్యలను పట్టించుకునే నాధుడే లేడని దీంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకు పోయారని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కౌలు రైతుల ఆత్మహత్యల్లో దేశంలోనే మనరాష్ట్రం రెండో స్థానంలో ఉండగా, రైతు ఆత్మ హత్యల్లో మూడో స్థానం నిలవడం రాష్ట్రంలో రైతుల దుస్థితిని అద్ధం పడుతుందన్నారు. రాష్ట్రం లో అస్తవ్యస్త పాలన కారణంగా రైతులు పడుతున్న ఇబ్బందులు చెప్పనలవి కావని, తడిసిన ధాన్యం కొనే దిక్కులేకుండా పోయిందన్న యార్లగడ్డ తక్షణం రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని మద్దతు ధరకు ప్రభుత్వం కొనాలని డిమాండ్ చేశారు. రైతులకు సబ్సిడీపై డ్రిప్పు పరికరాలు వ్యవసాయ పరికరాలు ఇవ్వటం ఎప్పుడో మానేశారని, రైతాంగానికి తీవ్ర ద్రోహం చేసిన జగన్ ప్రభుత్వాన్ని సాగనంపే రోజు దగ్గరలో ఉందని హెచ్చరించారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లాలో కోడిపందేలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్ లోని స్పందన సమావేశపు మందిరంలో పోలీసు, పశుసంవర్ధక తదితర శాఖాధికారులతో కోడి పందేల నిర్వహణ నిషేధంపై తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా కూడా కోడి పందేలు నిర్వహించకుండా సంబంధిత అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడ కోడి పందేలు జరుగుతున్నాయని సమాచారం అందిన వెంటనే అక్కడకు వెళ్లి తగు చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో కోడి పందేలు జరిగినట్లు తెలిసిన ప్రాంతాలలో 144 సెక్షన్ విధించాలని, బెట్టింగులు, పేకాట శిబిరాలపై దాడులు చేసి కేసులు నమోదు చేయాలని చెప్పారు. గత సంవత్సరంలో కోడి పందేలు నిర్వహించిన వారిని, కత్తులు కట్టే వారిని గుర్తించి బైండోవర్ చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి పెద్ది రోజా, ఏఎస్పి ఆర్. శ్రీహరిబాబు, పశు సంవర్ధక శాఖ అధికారి శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో జ్యోతిబసు ఇతర అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ డిల్లీరావు తదితరులు

జిల్లాస్థాయి స్పందనలో 161 అర్జీలు నమోదు

ప్రజాశక్తి - విజయవాడ : జిల్లాస్థాయి జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం నగరంలోని కలెక్టరేట్లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశం మందిరంలో జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు, డీఆర్వో ఎస్.వి నాగేశ్వరరావు అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. స్పందనలో 161 అర్జీలు నమోదు కాగా వీటిలో రెవెన్యూ విభాగానికి సంబంధించి 84, పోలీస్ శాఖకు సంబంధించి 19 అర్జీలు వచ్చాయి. పంచాయతీరాజ్-7, పౌర సరఫరాలు-6, హౌసింగ్-5 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో స్వీకరించిన అర్జీల పరిష్కారంలో అధికారులు అలసత్వం లేకుండా అర్జీదారుడు సంతప్తి చెందే స్థాయిలో నాణ్యతతో పరిష్కరం ఉండాలన్నారు. అర్జీలు రీఓపెన్ కాకుండా చూడాలని స్పష్టం చేశారు. స్పందనలోనే కాకుండా జగనన్నకు చెబుదాం పోర్టలో నమోదు అవుతున్న అర్జీలను కూడా అధికారులు ఎప్పటికప్పడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. అర్జీదారుల వినతులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా, జవాబుదారీతనంతో విచారణ చేయాలని జిల్లా కలెక్టర్ డిల్లీరావు అన్నారు. స్పందనలో వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.



షూటింగ్లో స్వర్ణ పతక విజేత తమన్యుకు కలెక్టర్ అభినందన

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : గత ఏడాది డిసెంబర్ 27 నుంచి జనవరి 1 వరకు మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరిగిన 67వ జాతీయ స్కూల్ గేమ్స్ ఛాంపియన్‌షిప్ షూటింగ్ విభాగంలో స్వర్ణ పతకం సాధించిన విజయవాడకు చెందిన 12 ఏళ్ల తమన్యు సిరంగినిని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అభినందించారు. తమన్యు సోమవారం కలెక్టరేట్లో కలెక్టర్ ఎస్.డిల్లీరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ తమన్యు భవిష్యత్తులోనూ జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో సత్తా చాటి పతకాలు కైవసం చేసుకోవాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగ అభివద్ధికి కూడా అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. ఈకార్యక్రమంలో డిఆర్ఓ ఎస్వి.నాగేశ్వరరావు, పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ కె.విద్యాసాగర్, కోచ్ ఎం.సుబ్రమణ్యేశ్వరరావు, తమన్యు తల్లి చందన తదితరులు పాల్గొన్నారు.

'స్పందన'లో 19 ఫిర్యాదులు

ప్రజాశక్తి - విజయవాడ : నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు సోమవారం విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 19 ఫిర్యాదులు వచ్చాయి. ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 1, టౌన్ ప్లానింగ్ 8, ఆర్.యఫ్.ఓ-1, హెల్త్ -1, పిఒయుసిడి 4, ఎస్టేట్ విభాగానికి సంబంధించి 4 అర్జీలను అధికారులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్(ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, చీఫ్ ఇంజనీర్ యం ప్రభాకర్ రావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ రత్నావళి, సిటీ ప్లానర్ జీవి జీఎస్వి ప్రసాద్, డిప్యూటీ కమీషనర్ (రెవిన్యూ) వెంకటలక్ష్మి, పిఒయు సి డి రోహిణి, ఏడిహెచ్ శ్రీనివాస్, జాయింట్ డైరెక్టర్ అమత్ లతా, అకౌంట్స్ ఆఫీసర్ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పదవికి ఎంపి కేశినేని కుమార్తె శ్వేత రాజీనామా

ఆమోదం పొందిన తర్వాత టిడిపికి కూడా రాజీనామా చేస్తానన్నారు. తాము ఎప్పుడూ టిడిపిని వీడాలని అనుకోలేదన్నారు. అయితే ఆ పార్టీయే తమను వద్దనుకున్నప్పుడు కొనసాగడం భావ్యంకాదన్నారు. విజయవాడ ఎంపి కేశినేని నాని కార్యకర్తలతో మాట్లాడి భవిష్యత్ కార్యచరణను ప్రకటిస్తారని చెప్పారు. గౌరవం లేని చోట తాము పనిచేయలేమన్నారు. నాని నగరంతోపాటు విజయవాడ పార్లమెంట్ పరిధిలో ఎన్నో అభివృద్ధి పనులు చేశారన్నారు. దుర్గగుడి ఫ్లైఓవర్, బెంజిసర్కిల్ ఫ్లైఓవర్, టాటాట్రస్ట్ ద్వారా గ్రామాలకు మంచినీటి సరఫరా, ఇలా అనేక మంచి పనులు చేశారని గుర్తుచేశారు. కేశినేని నాని, తాను ప్రజల తరుపున పోరాడతామని తెలిపారు. ఏడాది కాలంగా టిడిపిలో కేశినేని నాని అవమానాలు ఎదుర్కొంటూనే ఉన్నారని చెప్పారు. ఎన్‌టిఆర్ జిల్లాలో జరుగుతున్న పరిణామాలు ఇప్పటి వరకు పార్టీ అధిష్టానానికి తెలియదనే భ్రమలో తాము ఉన్నామన్నారు. విఎంసి ఎన్నికల సమయంలో తమను ముగ్గురు నాయకులు ఇబ్బంది పెట్టారని వివరించారు. ఈ నేపథ్యంలో తాము పార్టీని వీడ ఉతున్నామని, తమతో వచ్చే వారికి కచ్చితంగా అండగా ఉంటామని వివరించారు. తిరువూరులో చంద్రబాబు సభకూ, కేశినేని నానికీ ఏంటి సంబంధమని నారా లోకేష్ అడిగారన్నారు. కేశినేని నాని ప్రాతినిధ్యం వహిస్తున్న విజయవాడ పార్లమెంట్ నియోజవర్గంలో జరిగే సభకు ఆయనకు కాకుండా ఇంకెవరికి సంబంధం ఉంటుందని ప్రశ్నించారు. లోకేష్ వ్యాఖ్యలు ఆయన తెలివితేటలకు నిదర్శనమన్నారు. నాని మూడోసారి కూడా విజయవాడ పార్లమెంట్ నుంచే పోటీ చేస్తారని చెప్పారు. రాజకీయంగా తనకు ఇప్పటి వరకు అవకాశం ఇచ్చిన టిడిపి అధినేత చంద్రబాబుకు, నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. కేశినేని భవన్‌లో ఎప్పుడూ తాము ప్రజలకు అందుబాటులో ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ గోగుల వెంకట రమణారావు, కేశినేని అభిమానులు పాల్గొన్నారు. అంతకుముందు కేశినేని శ్వేత టిడిపికి రాజీనామా చేయనున్నట్లు ఎంపి కేశినేని తన ట్విట్టర్ వేదికగా వెల్లడించారు.

విమానాశ్రయంలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ బృందానికి స్వాగతం

కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, ఎస్పీ పి.జాషువా, జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్, విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్వాగతం పలికారు. విజయవాడలోని నోవాటెల్ హోటల్లో ఈనెల 9,10 తేదీల్లో పార్లమెంట్, అసెంబ్లీ-2024 ఎన్నికల సన్నద్ధతపై జరిగే సమావేశంలో పాల్గొనేందుకు ఇసి బృందం ఇక్కడికి వచ్చింది. అనంతరం వారు రోడ్డు మార్గాన నోవాటెల్ హోటల్‌కు వెళ్లారు. హోటల్ వద్ద ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీ రావు, కష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, సబ్ కలెక్టర్ అదితి సింగ్, డిఆర్ఒ ఎస్.వి. నాగేశ్వరావు స్వాగతం పలికారు.

టిడిపితోనే బిసిలకు న్యాయం : వెనిగండ్ల

ప్రజాశక్తి-గుడివాడ : తెలుగుదేశం పార్టీకి బీసీలు గుండెకాయ లాంటి వారు అని వెనిగండ్ల రాము పేర్కొన్నారు. ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జయహో బీసీ కార్యక్రమాన్ని గుడివాడ రాజేంద్రనగర్‌లోని జీవి పూర్ణ చంద్రయ్య కమ్యూనిటీ హాల్లో సోమవారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా వెనిగండ్ల రాము మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ హయంలో బీసీల సంక్షేమానికి జరిగిన కషిని క్షేత్రస్థాయిలోకి తీసుకువెళ్లాలని నాయకులు దిశా నిర్దేశం చేశారు. జనాభాలో 50 శాతం మంది బీసీలు ఉండగా జగన్‌రెడ్డి ప్రభుత్వంలో బీసీలకు అన్యాయం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి గురుమూర్తి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి కొనకళ్ళ బుల్లయ్య, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరావు జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ బోరగడ్డ శ్రీకాంత్, తెలుగుదేశం పార్టీ కష్ణా జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు నెరుసు కాశి, నియోజకవర్గ బీసీ సంఘం అధ్యక్షుడు అంగడాల శ్రీనివాసరావు, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు గోపు సత్యనారాయణ, జిల్లా కార్యాలయ కార్యదర్శి బత్తిన దాసు, తెలుగు మహిళా పట్టణ అధ్యక్షురాలు యార్లగడ్డ సుధారాణి పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న వెనిగండ్ల రాము


బహుమతులు అందజేస్తున్న దృశ్యం

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-బంటుమిల్లి : మండలంలోని మలపరాజు గూడెం సచివాలయం నందు నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో కబడ్డీ వాలీబాల్ సెటిల్ ఆటలు పోటీలు నిర్వహించారు. గెలిచిన విజేతలకు పాలడుగు ఏసు పాదం జ్ఞాపకార్థం వారి కుమారుడు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పాలడుగు బాబురావు చేతుల మీదగా బహుమతులు అందజేశారు. బంటుమిల్లి ఎంపీపీ వెలివిల చిన్నబాబు, జడ్పిటిసి మలిశెట్టి వెంకటరమణ, సీనియర్ నాయకులు మల్లిశెట్టి రాజబాబు, బంటుమిల్లి వైస్ ఎంపీపీ వడిమి చిన్నారి బాబు, పంచాయతీ ప్రెసిడెంట్ దూసనపూడి అవతారం పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసరాలు

ప్రజాశక్తి-చల్లపల్లి : అమ్మ పుట్టినరోజు సందర్భంగా అనాధలకు సాయం చేయాలనే ఆలోచన చిన్నారులకు రావటమే కాదు.. కిడ్డీ బ్యాంకులో దాచుకున్న డబ్బులతో సేవా కార్యక్రమం నిర్వహించి అందరి మన్ననలు అందు కున్నారు ఆ చిన్నారులు. అవనిగడ్డ మండలం వేక నూరు గ్రామానికి చెందిన ప్రముఖులు మాదివాడ రాము..పద్మావతి దంపతుల కుమారులు యోజిత్, తేజిత్ లు సోమవారం స్థానిక సీయోను వద్ధాశ్రమంలో నిత్యావసర సరుకులు అందించారు. చిన్నారులు అందించిన నగదుతో వద్ధాశ్రమంలో వద్ధుల ఆహారానికి అవసరమైన బియ్యం, కూరగాయలు, రవ్వలు, నూనె, పప్పులు తదితరుల సరుకులను ఆశ్రమ నిర్వాహకులు శీలం భాస్కరరావు దంపతులకు అందచేశారు.జర్నలిస్ట్ నడకుదురు లీలాబ్రహ్మేంద్ర పాల్గొన్నారు.

బుద్ధప్రసాద్ ను కలిసిన వెంకటకృష్ణ

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఇటీవల జనసేన పార్టీలో చేరిన అక్షయ డెవలపర్స్ ఎండి మాదివాడ వెంకటకష్ణ సోమవారం మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా బుద్ధ ప్రసాదు కు శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు. అనంతరం నియోజకవర్గ సమస్యల గురించి ఆయనతో చర్చించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఉమ్మడి కష్ణాజిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు, అవనిగడ్డ మండల పార్టీ అధ్యక్షుడు గుడివాడ శేషుబాబు, జనసేన టౌన్ ప్రచార ప్రధాన కార్యదర్శి అన్నప్రెడ్డి ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

కాపు సంక్షేమ సేవా అధ్యక్షురాలిగా పద్మావతి నియామకం

ప్రజాశక్తి-పెదపారుపూడి : పెదపారుపూడి మండలం కాపు సంక్షేమ మహిళా సేవా అధ్యక్షురాలుగా వెంట్రప్రగడ గ్రామానికి చెందిన మధుగుల పద్మావతిని నియమించారు. కాపు సంక్షేమ సేవా వ్యవస్థాపకులు చేగుండి హరి రామ జోగయ్య ఆదేశాల మేరకు రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కరణం నూకరత్న కళావతి తనకు నియామక పత్రాన్ని అందజేసినట్లు పద్మావతి తెలిపారు. తూర్పు కాపు, బలిజ, తెలగ కాపు, మున్నూరు కాపు సంక్షేమానికి కషి చేస్తానన్నారు.

'బాబు ష్యూరిటీ' కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి - గుడివాడ : నందివాడ మండలం చిన్న లింగాల గ్రామంలో "బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్ లతో కలిసి గుడివాడ నియోజకవర్గ ఇన్చార్జి వెనిగండ్ల రాము సోమవారం నిర్వహించారు. నియోజకవర్గ సర్పంచుల సంఘం అధ్యక్షుడు కాకరాల సురేష్, చినలింగాల సర్పంచి దాసం రాంబాబు, మండల అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, నాయకులు కొలకలేటి భవానీప్రసాద్, చాట్రగడ్డ రవి, అరెకెపూడి రామశాస్త్రులు, తాతినేని మురళి, మద్దాలి ఇసాక్, కొల్లి రమ్య పాల్గొన్నారు.
ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ రెండవ వార్డ్‌లో టిడిపి జనసేన పార్టీ ఆధ్వర్యంలో బాబు షఉరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మండలి వెంకట్ రామ్, జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మతి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో టీడీపీ జనసేన పార్టీ కార్యకర్తలు పాల్గొని ఇంటింటికి వెళ్లి ఉమ్మడి మినీ మేనిఫెస్టో వివరాలను వెల్లడిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు, నియోజకవర్గ తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు బండే కనకదుర్గ, పార్టీ నాయకులు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మాచవరం ఆదినారాయణ, బండే రాఘవ, అన్నపరెడ్డి పాల్గొన్నారు


చిన్నలింగాల గ్రామంలో పాల్గొన్న టిడిపి నాయకులు

జెసిగా అపరాజితసింగ్ సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో సంయుక్త కలెక్టర్ గా డాక్టర్ అపరాజిత సింగ్ అందించిన సేవలు ప్రశంసనీయమని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం నగరంలోని జెడ్పీ కన్వెన్షన్ హాలులో బదిలీపై ఉత్తర ప్రదేశ్ కేడర్ కు వెళు తున్న డా అపరాజిత సింగ్ కు జిల్లా యంత్రాంగం తరుపున ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డాక్టర్ అపరాజిత సింగ్ మంచి మానవతా మూర్తి అని కొనియాడారు. ముఖ్యంగా మచిలీపట్నంలో ఎంతో కాలం నుంచి ఎవరు పట్టించుకోకుండా ఉన్న అనాధ బాలల శిశుగహ భవనానికి నిధులు సమకూర్చి అన్ని వసతులతో తీర్చిదిద్దారని ఎంతోమంది అనాధ పిల్లలకు ఆశ్రయం కల్పించారన్నారు. జిల్లా ఎస్పీ పి జాషువా మాట్లాడుతూ డాక్టర్ అపరాజిత సింగ్ మానవతా హదయం కలిగిన గొప్ప అధికారిని ప్రశంసించారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఎస్పీ డిఆర్ఓ ఆర్డీవోలు జిల్లా అధికారులు సంయుక్త కలెక్టర్ ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పెద్ది రోజా, మచిలీపట్నం గుడివాడ ఉయ్యూరు ఆర్డిఓలు ఎం వాణి, పద్మావతి డి రాజు డిఎస్ఓ పార్వతి డిఆర్‌డిఏ డ్వామ పీడీలు పిఎస్ఆర్ ప్రసాద్ సూర్యనారాయణ జడ్పీ సీఈవో వి జ్యోతిబసు, డిపిఓ నాగేశ్వర్ నాయక్ డిఎంహెచ్ఓ గీతాబాయి డీఈవో తహెరా సుల్తానా పాల్గొన్నారు.



చెకుముకి పోటీల్లో వాణి విద్యానికేతన్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ : రానున్న రోజుల్లోనూ మంచి క్రీడాకారులుగా రాణించి మరిన్ని విజయాలు సాధించాలని వాణీవిద్యానికేతన్ కరస్పాం డెంట్ నందిగం రవికుమార్ విద్యార్థులకు సూచించారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన చెకుముకి సైన్స్ సంబరాల్లో బాపులపాడు మండలం వీరవల్లి వాణీవిద్యానికేతన్ విద్యార్థులు ప్రతిభ కనబరచి ప్రదమస్థానం కైవసం చేసుకున్నారు. వాణీ విద్యానికేతన్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో సోమవారం విద్యార్థులు శ్రీవైష్ణవి, జలీల, ఐశ్వర్యలను అభినందించారు. ప్రైవేటు స్కూల్ విభాగంలో ముగ్గురు విద్యార్థులు జిల్లాస్థాయి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారని రవికుమార్ తెలిపారు.

కనకదుర్గకు బంగారు పతకాలు

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : ఈ నెల 6,7 తేదీలలో విశాఖ పట్నం కేంద్రంగా నిర్వహించిన మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో మచిలీపట్నం బచ్చుపేట ప్రాంతానికి చెందిన మహిళ కనకదుర్గ వివిధ ఆటల పోటీలలో మొదటి స్థానంలో నిలచి మూడు గోల్డ్ మెడల్స్ సాధించారు. 100 మీటర్ల రన్నింగ్ రేసులో గోల్డ్ మెడల్, జావెలిన్ త్రో పోటీ నందు గోల్డ్ మెడల్, 100 మీటర్ల హార్డిల్స్ గోల్డ్ మోడల్ పొందారు. అంతేకాక జాతీయస్థాయిలో జరిగే పోటీలకు మచిలీపట్నం ప్రాంతానికి చెందిన కనకదుర్గ ఎంపికయ్యారు. విజేతగా నిలిచిన కనకదుర్గ భర్త సత్తార్ కష్ణాజిల్లా పోలీస్ శాఖ ఆర్ పేట పోలీస్ స్టేషన్ నందు హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. భర్త కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో మరింత ఉత్సాహంతో జాతీయస్థాయిలో విజేతగా నిలిచి కష్ణా జిల్లా పేరు ప్రతిష్టలు దేశవ్యాప్తంగా తీసుకువస్తానని తెలిపారు.

టిడిపితోనే సంక్షేమం సాధ్యం : వర్ల

ప్రజాశక్తి-పమిడిముక్కల : వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అవినీతి మాయమైందని, రైతులు, నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పామర్రు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి వర్ల కుమార్ రాజా అన్నారు. సోమవారం పమిడిముక్కల మండలంలోని వీరంకి లాకులో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు పేద ప్రజల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టా రన్నారు. మరలా ఎన్నికల్లో గెలిచి సంక్షేమ కార్యక్ర మాలను అమలు చేస్తామన్నారు. రైతురాజ్యం రావాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని ఆయన అన్నారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాజులపాటి శ్రీనివాసరావు, జక్కా శ్రీనివాసరావు, కొల్లూరు బాబ్జి, నాదెండ్ల సుబ్రహ్మణ్యం, గురుందిపల్లి శ్రీనివాసరావు, గోపాలకష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ తనిఖీలు

ప్రజాశక్తి-ఉయ్యూరు : విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారుల బందం సోమవారం ఉయ్యూరులో 2,079 గహ వినియోగ సర్వీసులు, 145 వాణిజ్య సర్వీసులు తనిఖీ చేసి అదనపు లోడు వాడుతున్న 145 సర్వీసులకు రూ.4,28,000 అపరాధ రుసుము విధించారు. ఉయ్యూరు డివిజన్ ఎగ్జిగ్యూటివ్ ఇంజనీరు డి. కష్ణనాయక్, విజిలెన్స్ ఎగ్జిగ్యూటివ్ ఇంజనీరు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అధికారులు 35 బందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. ఈసంద ర్భంగా మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని, చౌర్యానికి పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పండ్ల తోటల పెంపకంపై అవగాహన

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండలం తెలుగు రావు పాలెం సచివాలయం నందు లంక భూమి రైతులకు పండ్ల తోటల పెంపకంపై అవగాహన సదస్సు సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో టి.అనూహ్య మాట్లాడుతూ ఈ మధ్యనే మీ గ్రామంలో ఉన్న లంక భూమి సొసైటీలకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వడం జరిగిందని అన్నారు. లంక భూమి రైతులు పండ్ల తోటలు పెంచినట్లయితే కుటుంబాలు ఆర్థికంగా అభివద్ధి చెందుతా యన్నారు. పట్టుపురుగులు పెంపకం, జామ తోటలు, సపోటా, మునగా తోటలు మొదలైనవి పంపుదలకు ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు ఉంటాయన్నారు. ప్రతి ఒక్క సొసైటీ సభ్యు లు ఈ ఒక్క సదా అవకాశాన్ని ఉపయోగించుకుని ఆర్థికంగా అభి వృద్ధి చెందాలన్నారు. గ్రామ సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు, ఏపీవో సురేష్, పంచాయతీ కార్యదర్శి జి శ్రీనివాసరావు పాల్గొన్నారు

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి-ఉయ్యూరు : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరిం చాలని కోరుతూ ఉయ్యూరు నగర పంచాయతీ కార్యా లయం ముందు జరు గుతున్న సమ్మె సోమవారం నాటికి 14 రోజులకు చేరుకుంది .ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులు న్యాయమైన కోరికలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కారం చేయాలని కష్ణా జిల్లా సిఐటియు నేత బి రాజేష్ అన్నారు.



రేమల్లె హైస్కూల్లో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ : మన దేశ సంస్కృతి, సాంప్రదాయాలను విద్యార్థులకు తెలియజెప్పేందుకు సంక్రాంతి సంబరాలు ఉపయోగకరమని జెడ్పీటీసీ సభ్యురాలు గంగాభవాని, సర్పంచ్ భారతి అన్నారు. బాపులపాడు మండలం రేమల్లె హైస్కూల్లో హెచ్ఎం లూథర్పాల్ పర్యవేక్షణలో సోమవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో విదార్థులతో కలిసి వారు ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలుగుసాంప్రదాయంగా ఓణీలు ధరించి ముగ్గులు పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారు. హెచ్ఎం, ఉపాధ్యాయులతో కలిసి పొంగళ్లు వండటం, కోడిపందేలు, భోగామంటలు లతో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఉపాధ్యాయులు దారపురెడ్డి భాస్కరరావు వెలమర్తి రవిబాబు పర్యవేక్షణలో నిర్వహించిన ముగ్గుల పోటీలు, సాంస్కృతి కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులకు యనమదల సాంబశివరావు, వెలగపూడి మధుసూధనరావు, యనమదల సుధాకరరావులు బహుమతులను అందజేశారు. తుమ్మల వీరరాఘవరావు, కిషోర్బాబు, యనమదల రామారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-పెదపారుపూడి : మండల పరిధిలోని తమ్మలంపాడు గ్రామం నుండి వెళ్లి తారు రోడ్డు నందివాడ మండలం కుదరవల్లి గ్రామ రోడ్డుకు ఎంపీపీ గోగం సురేష్, నందివాడ మండలం జడ్పిటిసి కందుల దుర్గా కుమారి, ఎంపీపీ పెయ్యల ఆదాము శంకుస్థాపన చేశారు. సుమారు మూడు కోట్ల రూపాయలతో ఆర్ అండ్ బి నిధులతో శంకుస్థాపన చేసిన అనంతరం ఎంపీపీ గోగం సురేష్ మాట్లాడుతూ గ్రామంలో అర్హులైన వారి అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. వైఎస్ఆర్ మండల అధ్యక్షుడు గోళ్ళ సోమేశ్వరరావు, గ్రామ సర్పంచ్ వికత స్వాతి , సచివాలయ మండల కన్వీనర్ జాజుల చిన్నారి, ఎంపీటీసీ చిగురుపాటి అశోక్ కుమారి పాల్గొన్నారు .

కార్మికులపై పోలీసుల ఉక్కుపాదం



- ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరేట్ వద్దకు వెళ్లకుండానే అరెస్టులు
- స్పృహ తప్పిన పారిశుధ్య కార్మికురాలు

ప్రజాశక్తి-విజయవాడ

మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారం 14వ రోజూ నిరవధికంగా కొనసాగింది. తమ డిమాండ్లు పరిష్కరించాలంటూ ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరేట్ ముట్టడి చేపట్టిన మున్సిపల్ కార్మికుల ఆందోళనలో ఉద్రిక్తత నెలకొంది. కార్మికులను కలెక్టరేట్‌కు వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, కార్మికులు మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. హామీలు నెరవేర్చకుండా పోలీసులతో ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

తొలుత మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు, యూనియన్ నగర గౌరవాధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, యూనియన్ నగర అధ్యక్షులు ఎస్ జ్యోతిబస్, సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు మునిసిపల్ కార్మికులతో కలిసి బీసెంట్ రోడ్డు నుంచి ప్రదర్శనగా కలెక్టరేట్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో ఎంబివికె సమీప బందర్ రోడ్డుపై ఎసిపి డాక్టర్ పి రవికిరణ్, గవర్నర్‌పేట సిఐ అడపా నాగమురళి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది మున్సిపల్ కార్మికులను రోప్ పార్టీతో చుట్టుముట్టి ముందుకు కదలనీయకుండా అరెస్టులకు పాల్పడ్డారు. సుమారు 200 మంది వరకు కార్మికులను, నేతలను అరెస్టు చేసి వన్‌టౌన్, గవర్నర్‌పేట, సత్యనారాయణపురం, సూర్యారావుపేట తదితర పోలీస్టేషన్లకు తరలించారు. మరో 70 మందికి పైగా కార్మికులను రామవరప్పాడు వరకు వ్యానుల్లో తరలించి అక్కడ వదిలేశారు. అరెస్టుల సమయంలో పోలీసులకు, మునిసిపల్ కార్మికుల మధ్య పెద్ద ఎత్తున పెనుగులాట చోటుచేసుకుంది. మునిసిపల్ కార్మికులు రోడ్డుపై బైటాయించడంతో పోలీసులు వారి జుట్టు, బట్టలు, కాళ్లు, చేతులు పట్టుకొని ఈడ్చిపడేశారు. సీత అనే ఒక మహిళా కార్మికురాలి పొత్తి కడుపులో ఓ మహిళా కానిస్టేబుల్ బలంగా తన్నడంతో స్పృహ తప్పి రోడ్డుపైనే పడిపోయింది. బూటుకాలి దెబ్బకు కార్మికురాలు స్పృహతప్పి రోడ్డుపైనే పడిపోవడంతో ఈ విషయం ఎక్కడ మీడియా ఫోకస్ చేస్తుందోనని అక్కడి నుంచి ఆ మహిళా పోలీసు కానిస్టేబుల్‌ను తప్పించేసి జాగ్రత్తపడ్డారు. వంగల కుమారి అనే ఒక మహిళా కార్మికురాలు వన్‌టౌన్ పోలీస్టేషన్‌లో ఒత్తిడికి తట్టుకోలేక స్పృహ తప్పి పడిపోయింది. ఎంబివికె ఎదురు రహదారిపై వెళ్తున్న మహిళలను సైతం వదలకుండా పోలీసులు అరెస్టులు చేశారు. బట్టలు కొనుక్కుందామని షాపుకు వెళ్తున్నానని పామర్రుకు చెందిన ఒక మహిళ చెప్పినా వినకుండా అరెస్టు చేశారు.



అరెస్టుల పర్వం...



బందరు రోడ్డుపై బైటాయింపు











వన్‌టౌన్ పిఎస్‌లో ఆందోళన



వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో విడుదల అనంతరం నాయకులు, కార్మికులతో శ్రీనివాసరావు, మధు

సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్ర బంద్

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరేట్ ముట్టడి సందర్భంగా మున్సిపల్ కార్మికులు, నాయకులను కలెక్టరేట్ వద్దకు వెళ్లనీయకుండా ముందుగానే పోలీసులు అరెస్టులకు పాల్పడ్డారు. అరెస్టయిన నేతలను, కార్మికులను వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో వివిధ రంగాల్లో పని చేస్తున్న 250 మందికి పైగా కార్మికులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని నాయకులను, కార్మికులను విడుదల చేయాలని బైటాయించారు. పోలీసుల హడావుడితో విజయవాడ 24వ డివిజన్‌లో పనిచేసే వంగల కుమారి కళ్లు తిరిగి పడిపోవటంతో ఆమెను ఆసుపత్రికి తరలించారు. అరెస్టయిన నాయకులు, కార్మికులను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు పి.మధు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పరామర్శించారు. సాయంత్రం మూడు గంటల తరువాత విడుదల చేశారు. అనంతరం కార్మికులనుద్దేశించి శ్రీనివాసరావు, మధు మాట్లాడుతూ అంగన్‌వాడీలు, మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్ర బంద్ నిర్వహిస్తామని హెచ్చరించారు. మున్సిపల్ కార్మికులు గత 14 రోజులుగా సమ్మె చేస్తున్నా సిఎం జగన్‌కు పట్టడంలేదన్నారు.

శ్రీ సిమెంట్ సరికొత్త బ్రాండ్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

అతిపెద్ద సిమెంట్ తయారీదారుల్లో ఒకటైన శ్రీ సిమెంట్ కార్పొరేట్ బ్రాండ్ గుర్తింపును పునరుద్ధరించినట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నీరజ్ తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలను తెలియచేశారు. బంగూర్‌ను మాస్టర్ బ్రాండ్‌గా బహుళ బ్రాండ్ ఆఫర్లుగా అందించనుందని తెలిపారు. సిమెంట్ రంగంలో ఇప్పటికే శ్రీ సిమెంట్ సంస్థ నెంబర్‌వన్‌గా ఉందని తెలిపారు. ఎప్పటికపుడు నూతన పద్ధతులతో ఉత్పత్తులను ఆవిష్కరిస్తూ మన్నిక కలిగి ఉంటుందని తెలిపారు. ఇపుడు నూతన సంవత్సరంలో సరికొత్తగా బంగూర్ బ్రాండ్‌గా ఎంపికచేసినట్లు తెలిపారు.

విజయవాడలో జీ తెలుగు ఆడిషన్స్

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: విద్యార్థినీ, విద్యార్థులలో టాలెంట్‌ను ప్రోత్సహించేందుకు జీ తెలుగు డ్రామా జూనియర్స్ సీజన్ 7కు సంబంధించి ఆడిషన్స్‌ను విజయవాడలోని ఓ హోటల్‌లో ప్రారంభించినట్లు నిర్వాహఖులు సుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో జీ తెలుగు డ్రామా జూనియర్స్ పేరుతో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. ఇందులో భాగంగానే ఏడవసారి నిర్వహించే డ్రామా జూనియర్స్‌లో ప్రసారం చేసేందుకుగాను ఆడిషన్స్ జరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా పిల్లలకు డ్యాన్స్, పాటలు పాడటం, నటన, మ్యూజిక్ ట్రిక్స్, మార్షల్ ఆర్ట్స్‌తో పాటు మరేదైనా టాలెంట్ ఉన్నా ఇదే చక్కని అవకాశం అని ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. వివరాలకు 91000 54301 ఫోన్ ద్వారా వివరాలను తెలుసుకోవచ్చని తెలిపారు.

ఫ్యూచర్‌పాత్ విద్యార్థిని సోనమ్‌పాల్ ప్రతిభ



ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: నగరంలోని ఫ్యూచర్‌పాత్ ఇంగ్లీషు మీఇయం స్కూల్ విద్యార్థి సోనమ్‌పాల్ జాతీయ స్థాయి లీడ్ ఛాంపియన్ షిప్-2023 గ్రాండ్ ఫైనల్‌లో రన్నరప్‌గా నిలిచిందని స్కూల్ కరస్పాండెంట్ మామిడి శ్రీనివాసరావు తెలిపారు. ఈసందర్భంగా కేదారేశ్వరపేటలోని పాఠశాల ఆవరణలో సోమవారం ఉదయం విద్యార్థిని సోనమ్ పాల్‌ను పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రిటైర్డ్ విద్యాశాఖాధికారి సి.వి.ఎల్. నరసింహారావు మాట్లాడుతూ అత్యంత ప్రతిష్టాత్మకమైన జాతీయ స్థాయి లీడ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో ఫ్యూచర్‌పాత్ విద్యార్థిని రన్నరప్‌గా నిలవడం అభినందనీయమని తెలిపారు. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుండి ఎన్నో కార్పొరేట్ విద్యా సంస్థలు పాల్గొన్న ఈపోటీలలో నగరానికి చెందిన విద్యార్థి రన్నరప్‌గా సాధించిందంటే పాఠశాల ఎంతో కృషి చేసిందని ఈసందర్భంగా ఫ్యూచర్‌ఫాత్ ఉపాధ్యాయ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. స్కూల్ కరస్పాండెంట్ మామిడి శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 9500 పాఠశాలల నుంఇ 1.30 లక్షల మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొనగా తమ పాఠశాల విద్యార్థిని సోనమ్ పాల్ రన్నరప్‌గా నిలవడం తమ పాఠశాలకు గర్వకారణమన్నారు. అంతేకాక జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్టు నందు తమ విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.మాధురి మాట్లాడుతూ తమ పాఠశాలలో లీడ్ కరిక్యులమ్ అనుసరించి ఇంగ్లీషులో పిల్లల అభివృద్ధికై ఎల్గా అనే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అందుకే తమ విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థిని అపూర్వ విజయానికి సహకరించిన ఇన్‌ఛార్జి జాస్మిన్, శ్రీకాంత్, పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుని హ్యాపీ ఎస్తేరిని ఉపాధ్యాయ బృందం అభినందించారు.

టెన్నిస్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: నగరంలోని ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో సోమవారం ఉదయం ఎస్.వి. రామయ్య మెమోరియల్ ఐటిఎఫ్ టెన్నిస్ పోటీల ప్రారంభమయ్యాయి. పోటీలను నలంద విద్యా సంస్థల చైర్మర్ ఎ.విజయబాబు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ నగరంలో ఎస్‌వి రామయ్య మెమోరియల్ పేరుతో టెన్నిస్ ఫోటీలు జరగడం అభినందనీయమని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ క్రీడలను ఆడాలన్నారు. మంచి ఆరోగ్యం కోసం ఆటలు అవసరమని తెలిపారు. ఈకార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ లాన్ టెన్నిస్



అసోసియేషన్ ఉపాధ్యక్షులు డాక్టర్ కె. పట్టాభి రామయ్య, టోర్నమెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామకృష్ణ, డాక్టర్ ఎస్.జయదేవ్, డి.రామారావు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.